# వ్యాస నైకమత్యం

స్టాండులో బస్సు దిగి టౌనులోకి వెడుతున్న నేనూ, బజారు నుంచి ఇంటికి వస్తూన్న ఆయనా, పాల్‌చౌకు దగ్గర తలవని తలంపుగా తటస్థపడ్డాం.

పలకరింపుగా నవ్వాను. అది చూసి ఫక్కున నవ్వారు భమిడిపాటి కామేశ్వరరావుగారు. బోలెడు ఆశ్చర్యపడి కొయ్యబారిపోయాను.

ఎందుకంటారా? —

గుత్తులుగా, బొత్తులుగా, ఆయన ఎన్ని హాస్య రచనలు చేసినా ప్రసంగాలు చేసినా, ఛస్తే నవ్వరు.

అతి సీరియస్‌ హైస్కూల్లో పేరుపడ్డ లెక్కల మాస్టరు; ఒకసారి

ఆయన మంచి 'మూడ్'లో వుండగా అడిగాను, 'అయ్యా, పెదవిమీదకు ఒక్క చిరునవ్వు రేక చిందకుండా అంత హాస్యప్రసంగం ఎలా చెయ్య గలరండీ!' అని అంటే, కొంటెగా ఆయు నన్నారూ : 'తింటూ వడ్డిస్తే ఏం బావుంటుంది చెప్పండి! నేను హాస్యం వడ్డిస్తూన్నప్పుడు ఆ తిన్నవాడు తృప్తిగా నవ్వితే అదీ మనకు విజయం!' మహాగడుసు !

అయితే - ఇప్పుడు అంత అపూర్వకంగా అచ్చంగా - ఎందుకు నవ్వినట్టు ?

అదే మనవి చేస్తున్నాను. బరంపురం కేతకీ ఖారామసాలతో గార పట్టిన నా పళ్ళు బాగా లేవని— ఒక డెంటిస్టు తగిలితే—అంతకు నాలుగు రోజులక్రితం యంత్రదంతధావనం చేయించాను. నవ్వితే నా పళ్ళు మెరి శాయి. కామేశ్వరరావుగారూ, కేతకీ సేవనం చేసి చేసి గారపట్టిన తమ పళ్ళకున్నూ- సరిగ్గా వారంరోజుల కిందటే యంత్ర ధావనం చేయించారు. పళ్ళు ముత్యాల్లా వున్నాయి. నేను కనపడితే నన్ను ఆశ్చర్య చకితుణ్ని చేయాలనుకున్నారట !

తీరా నన్ను చూసి ఆయనే ఆశ్చర్య పడిపోయారు. ఖులాసాగా కొంతసేపు కబుర్లు చెప్పుకున్నాం. ఆ సంభాషణ చివర హఠాత్తుగా యిలా అన్నారు. "చూశారూ ఈ తెల్లపళ్ళ ఆనందం అట్టేకాలం నిలిచేలా లేదు. పళ్ళు తెల్లగా వుండాలంటే- ఖారాకిల్లీ వెయ్యకూడదు. పొగపీల్చవచ్చు. ప్రశస్తమైన లంకాకుచుట్టలు తెచ్చి ప్రయత్నించి చూశాను.

రాత్రి భోజనాలయాక ఒక చుట్ట వెలిగించి తృప్తిగా పీల్చి - ఆ సుఖంతో నిద్రిద్దామంటే- మా శ్రీమతి శ్రోత్రియుల ఇంటిబిడ్డ. పొగచుట్ట 'శ్రీగంధం' మైలు దూరంనుంచి పసికట్టగలదు. కనక ఏలకులు, లవం గాలు మిళాయించి నమిలి ముఖశుద్ధి చేసుకుని, అంతఃపురంలో అడుగు

పెట్టాలి. ఈ యాతన పడలేక చుట్టమానేద్దాం - కూటికా ? గుడ్డకా ? అని మొరాయించి మానేశాను.

రెండు రోజులు గడిచాయి.

ఉత్సాహం పోయింది. ఊహ పెకలందే? కలం పట్టుకుంటే జారి పోయింది. కణకణ వెలిగే మనస్సు నీళ్ళు జల్లినట్టు ఆరిపోయింది.

మహా చెడ్డ కోపం వొచ్చింది.

చుట్టా కాల్చక, సిగరెట్టూ పీల్చక, మొగలిపూల పసందు ఖారాకిల్లీ నమలక, మరి యెందుకు బతికినట్టు ?

రేపుదయం నుంచి "నిటలాక్షుం డిపుడెత్తి వచ్చినను రానీ" నాలుగు చుట్టలూ, అగ్గిపెట్టా జేబులో వేసుకుని, వరదరావు కాఫీహోటల్లో సుష్ఠుగా తిని చుట్ట వెలిగించి గుప్పు గుప్పున ఇంజనులా పొగవొదులుతూ గోదావరి స్టేషనుదాకా నడవాలి. అప్పుడు ఊళ్ళో పెద్దమనుషుల ఎదుట చుట్ట కాల్చలేని నా మొహమాటమూ పోతుంది నా స్థాయికి చుట్ట తగదేమో అన్న బితుకూ పటాపంచ లవుతుంది. అని ఒక ముహూర్తాన నిశ్చయించి — మర్నాడు ఉదయం తెల్లారగానే హోటల్‌కు వెళ్ళి శుభ్రంగా కావలసింది తిని కాఫీతాగి వీధిలోకొచ్చి జేబులోని ఆయుధ సామగ్రిని పలకరించి ధైర్యంగా ఒకచుట్ట తీసి వెలిగించబోతూండగా శ్రీపాద కామేశ్వరరావు గారు—ట్రైనింగ్ కాలేజీ లెక్చరర్— హోటల్లోకి వెడుతూ ఎదురై - "అప్పుడే కాఫీ అయిందా, కామేశ్వర్రావుగారూ !" అని పలకరిస్తే చుట్ట చప్పున జేబులోకి తోసేసి, ఏదోనండి, కొంచెం తొందరపని ఉంది... అంటూ నసిగి ఈవలపడి అంత బజారుండగా ఇక్కడే తొందరేల ? అని నాళంవారి సత్రందాకా వచ్చి మళ్ళా చెయ్యి జేబులో పెట్టాను. ఇంతలో

ఎక్కడి నుంచి వూడిపడ్డాడో మా స్కూలు ఎస్. ఎస్. ఎల్. సి. కుర్రాడు నమస్కారం మేష్టారూ! మాకు రేపు ప్రైవేట్ క్లాసుందాండీ? అంటూ సాక్షాత్కరించాడు. వీడు రేపు స్కూల్లో నా చుట్ట సంగతి టాంటాం చెయ్యొచ్చు. చేసింది గుంభనగా చేద్దాం. వీణ్ణి దాటిపోనీ అనుకుని నవ్వు వెలవెల పోనివ్వకుండా జాగ్రత్తపడి వాణ్ని పంపేసి ముందుకు నడిచాను.

పెద్ద మసీదు దాటింది.

కూరల మార్కెట్టు కడచింది.

పౌరుషం ముంచుకొచ్చింది.

గోదావరి స్టేషన్ కనపడుతోంది.

చప్పున చుట్టతీసి వెలిగించాను. అలవాటు లేక ఇంకా బాగా అంటుకోలేదు. కసితీరా పొగ లోపలికి లాగి ఒదలాలి. 'ఇదిగో భమిడిపాటి వారు! రైలుకా? ఆర్యాపురం వైపా?' అంటూ కవి సార్వభౌమ శ్రీకృష్ణమూర్తిశాస్త్రిగారు ప్రత్యక్షమయ్యారు.

చచ్చినంత పనయింది. అంతటివాడు చుట్టతో నన్ను చూస్తే ఇంకేమయినా ఉందా? చుట్ట పక్కకు జార్చేసి ఏదో సమాధానం చెప్పి బయటపడి– ఇక మనకు చుట్ట యోగంలేదు, అని గోదావరి గట్టున నడుస్తూ – చుట్టలు, అగ్గిపెట్టె విసిరి పారేశాను.

అని కథ ముగించేసరికి కామేశ్వరరావుగారూ, నేనూ మంచి సెంటర్లో కొచ్చాం. పక్క కిల్లీకొట్టు దగ్గర ఆపి, కామేశ్వరరావుగారు కసిదీరా బంగాళా ఆకుతో ఖారా కిల్లీలు రెండు బందోబస్తుగా కట్టించి ఒకటి నాకిచ్చి, తా మొకటి బిగించి నవ్వుతూ "ఇక పదండి" అన్నారు.